## కార్ల షెడ్‌లో అగ్ని ప్రమాదం



**తూప్రాన్, అక్టోబర్ 25 (ప్రజా స్వరం ) :**

మెదక్ జిల్లా తూప్రాన్‌లో కార్ల రిపేర్ షాప్‌లో గురువారం అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గురువారం అర్ధరాత్రి సమయంలో తూప్రాన్ లోని నర్సాపూర్ చౌరస్తా సమీపంలో ఉన్న లిమ్రా కార్ మెకానిక్ షెడ్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి షెడ్డులో ఉన్న ఎనిమిది కార్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు తూప్రాన్ పోలీసులకు, ఫైర్ ఆఫీసర్లకు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్లు ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే షెడ్‌లోని 8 కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కాగా, ప్రమాదం ఎలా జరిగిందనే విషయమై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## ధాన్యం కొనుగోలుపై తహశీల్దార్ సమీక్ష



**నార్సింగి, అక్టోబర్ 25 (ప్రజా స్వరం) :**

నార్సింగి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక తహశీల్దార్ షేక్ కరీం వరి ధాన్యం కొనుగోలుపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమీక్షా నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా షేక్ కరీం మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. సరైన తేమ శాతం వచ్చిన వడ్లను కాంటా వేయాలని, తూకం వేసిన వడ్లను రైస్ మిల్లర్లకు వెంటనే పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు. ఏదైనా కారణం చేత వడ్ల సంచులను నిలువ ఉంచ వలసి వస్తే, నిలువ ఉంచడానికి సరైన చోటు, వర్షం నుంచి కాపాడడానికి టాపర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతుల నుంచి సేకరించిన వడ్ల వివరాలు, రైతు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, తద్వారా రైతులకు డబ్బులు తొందరగా జమ అయ్యేలా చూడాలన్నారు. వడ్ల తరలింపులో లారీలు, సంచులు మొదలగు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని, తాము సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడే విధంగా, రైతులను సహకరించే విధంగా వసతులు కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపీడీవో ఆనంద్, ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీ శంకర్‌యాదవ్, సుల్తానా, పీఏసీఎస్, ఎఫ్పీసీ కొనుగోలు కేంద్రాల సిబ్బంది, ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## అండర్ 19 క్రికెట్‌కు దౌల్తాబాద్ విద్యార్థి



**దౌల్తాబాద్, అక్టోబర్ 25( ప్రజాస్వరం) :**

ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 19 క్రికెట్ జట్టుకు దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి యోగేందర్ ఎంపికైనట్లు కళాశాల ప్రధానోపాధ్యాయులు మధు శ్రీవాత్సవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో జరిగిన అండర్ 19 క్రికెట్ టోర్నమెంటులో దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి జీర్కపల్లి యోగేందర్ అండర్ 19 ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తూ కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. అండర్ 19 ఉమ్మడి మెదక్ జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనందుకు కళాశాల అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.



## నేర రహిత సమాజ నిర్మాణంలో

# సీసీ కెమెరాలు కీలకం

**ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం**

**గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి**

**మెదక్, అక్టోబర్ 25 (ప్రజా స్వరం) :**

అసాంఘిక కార్యకలాపాలకు నివారించడానికి ప్రత్యేకంగా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలనీ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నర్సాపూర్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ సిబ్బంది తో జిల్లా ఎస్పీ డి .ఉదయ్ కుమార్ రెడ్డి. క్రైమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణ ప్రజలు ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చి తమ గ్రామాలలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు ద్వారా నేరాలు అదుపు చేయవచ్చని దొంగతనాలను నివారించే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఒక వేళ దొంగతనం జరిగినా సీసీ కెమెరాలు ద్వారా వారిని గుర్తించి పట్టుకోవడం జరుగుతుందన్నారు. ఇది వరకు సీసీ కెమెరాల ద్వారా ఎన్నో నేరాలు అరికట్టడం జరిగిందని సీసీ కెమెరాలు ద్వారా ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని ఏదైనా సంఘటన జరిగిన వెంటనే తెలుసుకోవచ్చని సీసీ కెమెరాలు 24 గంటలు ప్రజలకు రక్షణగా నిలుస్తాయని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని అందువల్ల సీసీ కెమెరాలు ప్రాధాన్యాన్ని గుర్తించాలని కోరారు. అన్ని పోలీస్ స్టేషన్లో పరిధిలోని గ్రామాల్లో, ప్రధాన కూడలిలో, వ్యాపార సముదాయాల్లో, ప్రధాన రహదారుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే ప్రజలకు మరింత చేరువ అయ్యేలా పోలీస్ విధులు ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలని, బాధితులకు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్ స్టేషన్ ని సంప్రదించవచ్చున్నారు. పోలీస్ స్టేషన్ లో పెట్రోల్ కార్, బ్లూ కోట్ సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు దూరంగా ఉన్నప్పటికీ 10 నిమిషాల్లో చేరుకునే విధంగా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ డిఎస్పీ వెంకట్ రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ పంట విస్తరణకు

# ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్ అక్టోబర్ 25 (ప్రజా స్వరం) :**

ఆయిల్ ఫామ్ విస్తరణ కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత తెలుస్తుందని దానికి అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పగడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లాలో ఆయిల్ ఫామ్ విస్తరణ పై కలెక్టర్ రాహుల్ రాజ్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట విస్తరణ ను ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తుందనీ అన్నారు. అదే విధంగా దేశానికి అవసరమైన నూనె ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం, నూనె ఉత్పత్తి లో స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందన్నారు. వరి తో పోల్చుకుంటే రెట్టింపు ఆదాయం పొందవచ్చు, రైతులను కొత్త పంటల సాగు వైపు మళ్ళే విధంగా రైతులను అవగాహన పరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు. ఏఈఓ తమ వంతు బాధ్యతగా ప్రాధాన్యత అంశగా తీసుకొని రైతులను గుర్తించాలని వివరించారు. ఆయిల్ పామ్ విస్తరణ కూడా ప్రతి ఏఈఓ యొక్క బాధ్యత కాబట్టి రైతులను ఆయిల్ పంట సాగు వైపు ప్రోత్సహించాలని ఒక ఎకరా వరి వేసే నీళ్ళతో 5 ఎకరాల ఆయిల్ పంట పండించవచ్చని, పైగా ఆయిల్ పామ్ పంట దేశంలో ఎ పంటకి లేని విధంగా చట్టం ద్వారా, ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా సంబధిత కంపెనీ కొనుగోలు చేస్తారని, కోతుల బెడద లేని పంట కాబట్టి రైతులందరూ ముందుకు వచ్చి ఆయిల్ పంట సాగు చేపట్టాలని సూచించారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేపట్టు రైతులకు మొక్కలపై రాయితీ తో పాటు నాలుగు సంవత్సరములు తోట నిర్వహణ, అంతర పంటల సాగు కొరకు రాయితీ మొత్తంగా 26, 450 సొమ్మును రైతుల ఖాతాకు జమ చేయబడునన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి, ప్రతాప్ సింగ్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.






## నేడు విద్యార్థుల తల్లిదండ్రులకు సమీక్ష

**దౌల్తాబాద్, అక్టోబర్ 25( ప్రజాస్వరం) :**

మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌లో చదివే విద్యార్థులను కళాశాలకు పక్షాన తల్లిదండ్రులకు శనివారం సమీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మధు శ్రీ వాత్సవ శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులను అకాడమిక్ ప్రగతి ని డిజిటలైజేషన్‌లో భాగంగా శనివారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమీక్ష నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు వచ్చే విధంగా తల్లిదండ్రులు చర్య తీసుకోవాలన్నారు. ఏపీ ఏఏ ఆర్ కార్డు యొక్క లాభాలు గురించి వివరించడం జరుగుతుందన్నారు. శనివారం కళాశాలలో ఉదయం 11:00 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఆధార్‌కార్డు, పాన్‌కార్డు ఈపీఐసీ/ ప్రభుత్వ ఐడీ కార్డులతో కళాశాలకు రావాలని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.



## మత్స్యకారుల అభివృద్ధికి

# ప్రభుత్వం కృషి



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని పూడూరు గ్రామ ముదిరాజ్ సంఘం యూత్ అధ్యక్షుడు మర్కంటి నాగరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై పంపిణీ చేసిన చేప పిల్లలను శుక్రవారం మండల పరిధిలోని పూడూరు గ్రామంలోని ఎర్ర చెరువు, మొగుళ్ల చెరువు, మోతులకుంట,నెల్లికుంట చెరువులలో 70వేల చేప పిల్లలను వదిలినట్టుగా తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ ఆలస్యంగా ఐన ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.కాగా చెరువుల విస్తీర్ణంలో కేవలం సగం మాత్రమే పంపిణీ చేసిందన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి సర్కార్ గత ప్రభుత్వం ఇచ్చినట్టుగా 100శాతం సబ్సిడీతో మొత్తం విస్తీర్ణంలో చేప పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యూత్ ఉపాధ్యక్షులు పరమేశ్, నీరుడి శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి నీరుడి శ్రవణ్, మర్రిచెట్టు పాండు, మర్రి చెట్టు శ్రీనివాస్, కొండా శ్రీనివాస్, తుపాకుల గోపాల్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.



## అప్పాయిపల్లిలో ఉపాధి హామీ

# రాష్ట్ర సిబ్బంది పర్యటన

**దౌల్తాబాద్, అక్టోబర్ 25 (ప్రజాస్వరం) :**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సంబంధించి 2025 26 సంవత్సరానికి పనులు గుర్తింపు కొరకు మండలంలోని అప్పాయి పల్లి గ్రామంలో పర్యటించారు. రాష్ట్ర కార్యాలయ ఈసీ అబేద్ ఖాన్ గ్రామసభలో తీర్మానించిన పనులు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. వారితోపాటు డీఆర్డీఏ హెచ్ఆర్ మేనేజర్ నర్సింహారావు, ప్లాంటేషన్ మేనేజర్ మహేందర్, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, ఏపీవో రాజు, ఈసీ స్వప్న, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధికి శాస్త్రీయ విజ్ఞానమే పునాది





**మెదక్, అక్టోబర్ 25 (ప్రజా స్వరం) :**

శాస్త్రీయ విజ్ఞానమే దేశాభివృద్ధికి పునాది అని పట్టణ సీఐ నాగరాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మెదక్ జిల్లా కేంద్రంలోని గీత జూనియర్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, డ్రగ్స్, మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సీఐ నాగరాజు, ఉప్పులేటి నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలోని మూఢ నమ్మకాలను విద్యార్థులు వదిలి పెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని, దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పులేటి నరేష్ మాంత్రికులు భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రసాద్ రావు, ప్రిన్సిపల్ సాయి రామ్, పోలీస్ సిబ్బంది అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



WWW.PRAJASWARAMDAILY.COM

